చిల్లర రాజకీయాలు మానుకోండి...

- టిడిపి కార్పొరేటర్లపై దురుసుగా వ్యవహరించిన మేయర్
- పాణ్యం నియోజకవర్గంలో తాగునీరు కల్తీ కాకుండా చర్యలు తీసుకోవాలి - పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి
- నగరాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు - కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

టిడిపి కార్పొరేటర్లు చిల్లర రాజకీయాలు మాని హుందాగా వ్యవహరించాలని, కుల, మత, రాజకీయాలకతీతంగా నగరంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని మేయర్ బివై.రామయ్య తెలిపారు. బుధవారం కర్నూలు నగరంలోని ఎస్‌బిఐ కాలనీలో ఉన్న కొత్త కౌన్సిల్ హాలులో కర్నూలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మేయర్ రామయ్య అధ్యక్షత వహించారు. ముందుగా కౌన్సిల్‌లో ఉన్న మహిళలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరాభివృద్ధి, పరిపాలనకు సంబంధించిన 60 అంశాలపై అజెండాను కౌన్సిల్‌లో చదివి చర్చించి ఆమోదించారు.



మాట్లాడుతున్న మేయర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని

తాగునీరు కల్తీ కాకుండా చూడాలి

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

పాణ్యం పరిధిలో 26, 27వ వార్డుల్లో తాగునీరు కల్తీ అయి దుర్వాసన వస్తోంది. కలుషితం కాకుండా చూడాలి. శ్మశానానికి ప్రహరీ ఏర్పాటు చేయాలి. విఠల్ నగర్ నుంచి హంద్రీ మీదుగా కల్లూరు దర్వాజా వరకు వీధిలైట్లు వేయాలి. నగరంలో 17 ఒహెచ్‌ఆర్ ట్యాంకులు, కర్నూలు నగర జనాభాకు అనుగుణంగా అమృత్-2 కింద రూ.132 కోట్లతో 17 ఎంఎల్‌డి సామర్థ్యంతో ఫిల్టర్ బెడ్లను నిర్మించి తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నాం. వీకర్ సెక్షన్ కాలనీలో డ్రెయినేజీ కాలువల్లో పైపులైన్లు ఉన్నాయి. వాటిని వేరు చేసి తాగునీరు కలుషితం కాకుండా చూడాలి. హంద్రీనదిని రూ.1.5 కోట్లతో శుభ్రం చేశాం. ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు, కంపచెట్లు తొలగిస్తున్నాం. ఇతర ఏ కార్పొరేషన్‌లో చెత్త పన్ను ఇంత లేదని, చెత్త పన్నును స్లమ్ ఏరియాల్లో రూ.30, కమర్షియల్ ఏరియాల్లో రూ.60 చొప్పున వసూలు చేసే విధంగా తీర్మానం చేయాలి. కొత్తగా నగరంలో విలీనమైన స్టాంటన్‌పురం, మావిదాలపాడు, మునగాలపాడు గ్రామాల ప్రజలకు ఒక్కసారిగా పన్నుల భారం వేయకుండా తగ్గించాలి.

కులమతాలు, పార్టీలకతీతంగా అభివృద్ధి

- కర్నూలు ఎమ్మెల్యే ఎం ఎ హాఫీస్ ఖాన్.

నగరంలో కులమతాలు, రాజకీయాలకతీతంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నాం. ఎవరికి ఏ పనులు కావాలన్నా వివక్ష చూడకుండా సమస్యలను రాసి ఇస్తే అభివృద్ధి చేస్తాం. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేస్తున్నా టిడిపి కార్పొరేటర్లు దురుసుగా వ్యవహరిస్తూ నోటికి వచ్చినట్లు మాట్లాడటం సంస్కారం కాదు. కర్నూలు నగరానికి గుర్తుగా ఉన్న కొండారెడ్డి బురుజు ప్రతిష్టను వేనోళ్ల పొగిడేలా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించి సహకరిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తుంగభద్ర, హంద్రీనదుల పరివాహక ప్రదేశాల బండ్ రోడ్డును పూర్తి చేస్తే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం 150 క్యూసెక్కుల నీటిని సుంకేసుల రిజర్వాయర్ నుంచి నగరానికి చేర్చే క్రమంలో మధ్యలో జలచౌర్యం జరిగి, కొంత నీరు ఆవిరై కేవలం 50 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతోంది. నీరు వృథా కాకుండా పైపులైన్ ద్వారా నగరానికి తీసుకొచ్చే ప్రాజెక్టును పూర్తి చేయాలి. గతంలో అమృత్ పథకం కింద ఉచితంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చి మోసం చేశారు. ప్రస్తుతం డబ్బులు చెల్లించాలని చెప్పడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి - కమిషనర్ భార్గవ్ తేజ

వర్షాభావ పరిస్థితుల వల్ల నదుల్లో నీరు సమృద్ధిగా లేదు. కర్నూలు నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి. ఏ వార్డులో, ఏ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక

రాజీవ్ గృహకల్ప, వాసవీ నగర్, గీతానగర్‌లో వేసవిలోనే కాదు... ప్రస్తుతం కూడా నీటి సమస్య ఉంది. తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

అజెండాలో ఉన్న అంశాలపై కార్పొరేటర్లు మాట్లాడుతూ... నగరంలో అత్యవసర పనుల కింద కేటాయించిన నిధులు నామినేషన్ వర్కులు సి బిల్లులు చేసి తీసుకొని మళ్లీ బిల్లులు చేస్తున్నారని విమర్శించారు. డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, సిటీ ప్లానర్ మీనా కుమారి, డిసిపి మోహన్ కుమార్, ఎస్‌ఇ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పొలంబడి నిర్వీర్యం

- మండలంలో రెండింటికే పరిమితం
- ప్రభుత్వ నిర్ణయంపై రైతుల మండిపాటు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రైతులకు సాగు గురించిన అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో చేపట్టే పొలంబడి కార్యక్రమం నిర్వీర్యానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండలంలో రెండు గ్రామాలకే పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం పట్ల రైతులు, రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి...

పొలంబడి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులు తదితర అంశాలపై సాధారణ రైతులకు సమగ్ర అవగాహన కల్పిస్తారు. సన్న, చిన్నకారు రైతులకు ఎంతో ఉపయుక్తమైన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం కుదించింది. 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఒక్కో జిల్లాకు 49, రబీలో కర్నూలుకు 30, నంద్యాలకు 35 పొలంబడుల లక్ష్యాలు నిర్దేశించారు. 2021లో ఒక్కో మండలానికి అన్ని రకాల పంటలకు కలిపి 29-30 వరకు నిర్వహించగా ప్రస్తుతం ఒక మండలానికి రెండే నిర్వహించాలని ఆదేశాలొచ్చాయి. సాగుపై రైతును స్వయం నిర్ణయాధికారిగా చేయడం వ్యవసాయ శాస్త్రవేత్తగా తీర్చిదిద్దడంతో పాటు. ఆరోగ్యకరమైన పంటలు పండించేలా సమగ్ర అవగాహన కల్పించడమే పొలంబడి ముఖ్య ఉద్దేశం. పంట విత్తుకు ముందు నుంచి కోత వరకు 14 వారాల పాటు అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తారు. పొలంబడి 10 హెక్టార్లలో ఉంటుంది. దాని పరిధిలో 30 మంది రైతులు ఉంటారు. కార్యక్రమం నిర్వహణకు సమన్వయకర్తగా ఓ రైతును ఎంపిక చేస్తారు. ఆయన రెండెకరాల పొలంలో పొలంబడిని ప్రయోగాత్మకంగా నిర్వహిస్తారు. సమన్వయకర్త పొలంలో నిర్వహించే కార్యక్రమాలు తెలుసుకొని మిగిలిన 29 మంది తమ పొలాల్లో సొంతంగా పొలంబడి కార్యక్రమాలు నిర్వహించుకునేలా చైతన్యం తీసుకురావాలి. 2021 ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలో 1,583 పొలంబడులు నిర్వహించగా 2022లో 871తో సరిపెట్టారు. ఈసారి 98కి కుదించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 6,59,690 హెక్టార్లు. కర్నూలు జిల్లాలోని 26 మండలాల్లో 4,21,560 హెకార్లు కాగా నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లో 2,38,130 సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో పత్తి ఎక్కువ భాగం ఉంటుంది. పొలంబడి కార్యక్రమం కింద వివిధ రకాల పంటలు, రైతులను ఎంపిక చేసి వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్తారు. విత్తు మొదలు కోత వరకు అవగాహన కల్పిస్తారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలానికి రెండు గ్రామాల్లోనే పొలంబడి కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రైతులు మండిపడుతున్నారు. వాటిని అధికార పార్టీ నేతలు సిఫార్సు చేసిన గ్రామాలనే ఎంపిక చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఒక చోట వ్యవసాయాధికారి, మరోచోట వ్యవసాయ సహాయకుడు పొలంబడి నిర్వహిస్తారు. మిగిలిన గ్రామాల్లో ఎత్తివేశారు. నిర్వహణ నిమిత్తం ఒక్కోదానికి రూ.20,510 నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 98 పొలంబడులకు రూ.20.10 లక్షలు కేటాయించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. రైతులకు మేలు చేసే పొలంబడికి కోత విధించడం ఎంత వరకు సబబని రైతులు ప్రశ్నిస్తున్నారు.



కౌతాళం మండలంలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై దృష్టి

- ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇళ్ల నిర్మాణాల్లో వారాంతపు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలను కూడా సంబంధిత కాంట్రాక్టర్లతో వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. కౌతాళం మండలంలో ఇళ్ల నిర్మాణాలను పెంచే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు త్వరగా విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు గాను స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా బ్రిక్ ప్లాంట్స్ ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆదోని లేఅవుట్ పరిసరాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం జరుగుతున్నందున పనుల్లో కొంత మేర జాప్యం జరిగిందని హౌసింగ్ అధికారులు ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు వివరించారు. ప్రత్యామ్నాయంగా మరోచోట నుంచి లైన్ ఏర్పాటు చేసుకొని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆలూరు, చిప్పగిరి మండలాల్లో బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న నిర్మాణాలను రూఫ్ లెవెల్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓర్వకల్లు లేఅవుట్‌లో పూర్తయిన ఇళ్ల నిర్మాణాలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు రూఫ్ లెవెల్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలని, ఆర్చి నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఎస్‌ఇని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. ఇసుకకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది లేదని హౌసింగ్ అధికారులు తెలిపారు. హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ మల్లిఖార్జునుడు, పంచాయతీ రాజ్ ఎస్‌ఇ సుబ్రమణ్యం, హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ సిద్ధలింగ మూర్తి, ఈఈ నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మౌర్య

అక్టోబర్ 14, 15న ఎస్‌ఐ ఫైనల్ పరీక్షలు

- పోలీసు శాఖ కీలక ప్రకటన
- జిల్లాలో జోరుగా కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్‌ఐ నియామక ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షలు జిల్లాలో వివిధ దశల్లో జోరుగా సాగుతున్నాయి. పోలీసు శాఖ బుధవారం ఈ పరీక్షలకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. ప్రాథమిక రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఫైనల్‌గా రాత పరీక్షలను అక్టోబర్ 14, 15న నిర్వహించనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో విశాఖ, గుంటూరు, ఏలూరు, కర్నూలు జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. పరీక్షల్లో మొత్తం 4 పేపర్లను అభ్యర్థులు రాయాల్సి ఉంటుంది. ఇందులో 1, 2 పేపర్లు రాత పరీక్ష, 3, 4 పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు స్పష్టం చేసింది. ఫిబ్రవరి 19న ప్రిలిమినరీ రాత పరీక్షలు నిర్వహించింది. అందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 20 వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. రాయలసీమ జోన్ పరిధిలోని అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ నిమిత్తం కర్నూలు ఎపిఎస్‌పి 2వ బెటాలియన్ మైదానాన్ని వేదికగా నిర్ణయించింది. దేహదారుఢ్య పరీక్షలు మొదలై ఇప్పటికే 5వ రోజు విజయవంతంగా పూర్తయ్యాయి. రాయలసీమ జోన్ పరిధిలో కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్, ఎస్పీ జి.కృష్ణకాంత్ దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. రాయలసీమ రేంజ్ పరిధిలో 16,108 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారు. ఇందులో 14,011 మంది పురుషులు, 2,097 మంది మహిళ అభ్యర్థులు ఉన్నారు. రోజూ 800 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొంటారని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది. దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో అత్యధిక సాంకేతికతతో కూడిన పరికరాలను వినియోగిస్తున్నారు. ఈ ప్రక్రియను విజయవంతం చేయడానికి వివిధ జిల్లాల్లోని 300 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నారు.



దేహదారుఢ్య పరీక్షలను పరిశీలిస్తున్న డిఐజి సెంథిల్ కుమార్ (ఫైల్)

ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు

- జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్
- ఎల్‌ఐసి ఉద్యోగులతో అవగాహన ఒప్పందం



మాట్లాడుతున్న హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎల్‌ఐసి ఆఫీసర్ ఇస్సాక్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పటల్

ఎల్‌ఐసి ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవగాహన ఒప్పందం చేసుకున్నామని జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 23 నుండి 29వ తేదీ వరకు ప్రైమ్ లాండ్ హోటల్‌లో ఎల్‌ఐసి ఎంప్లాయీస్ ఎంగేజ్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్‌ఐసి ఆఫీసర్స్ ఇస్సాక్ (చీఫ్ మేనేజర్) జావేద్ అలీఖాన్ అధ్యక్షత వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎల్‌ఐసి ఉద్యోగులతో జెమ్ కేర్ హాస్పిటల్స్ అవగాహన ఒప్పందం (ఎంఒయు) చేసుకున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించుటకు ఈ ఒప్పందం చేసుకున్నామని, రాయితీ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల నుండి ఉద్యోగులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జెమ్ కేర్ కామినేని హాస్పిటల్స్ సిఒఒ డాక్టర్ గణేష్, డాక్టర్ రమేష్, డాక్టర్ జయ శ్రీ, డిజిఎం రమణ, జనరల్ మేనేజర్ నదీమ్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

- విజేతలకు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, నారాయణ విద్యాసంస్థల ఎజిఎం రమేష్ అభినందన

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

ఈ నెల 26, 27వ తేదీలలో బెంగళూరులో జరిగిన వెస్టర్స్ కప్ మొదటి జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలలో కర్నూల్ నగరానికి చెందిన నారాయణ విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. బుధవారం కర్నూలు ఎమ్మెల్యే కార్యాలయంలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, నారాయణ విద్యాసంస్థల ఎజిఎం రమేష్ కుమార్‌లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని అన్నారు. గొప్ప విజయాలను సాధించిన నారాయణ విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. పతకాలు సాధించిన వారిలో 10వ తరగతి విద్యార్థిని ఎంజి.ఇందిరా ప్రియదర్శిని, 9వ తరగతి విద్యార్థి డి.మహమ్మద్ షహల్ అష్రఫ్‌లు గోల్డ్ మెడల్, 7వ తరగతి విద్యార్థి వై.హర్షవర్ధన్ సిల్వర్ మెడల్, ఐదవ తరగతి విద్యార్థి మహమ్మద్ అద్నాన్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ శ్రీనివాసరెడ్డి, దినేష్ కుమార్, అజీజ్, తైక్వాండో శిక్షకులు జి.షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, నారాయణ విద్యాసంస్థల ఎజిఎం రమేష్

నిరుద్యోగం, ధరల అదుపులో కేంద్రం విఫలం

- సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య, ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని సిపిఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి రాజశేఖర్ విమర్శించారు. భారాలకు వ్యతిరేకంగా, దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, అధిక ధరలు అదుపు చేయాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలని సిపిఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కర్నూలు నగరంలోని పూల బజార్ సెంటర్లో ఓల్డ్ సిటీ కార్యవర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు కరెంట్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు నాలుగు సంవత్సరాల కాలంలో ఏడుసార్లు పెంచారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ చార్జీలపై ప్రజలకు ఒక సంవత్సరంలో 4 వేల కోట్ల భారం వేశారన్నారు. వ్యవసాయ కరెంట్ మోటార్లకు మీటర్లు బిగించే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. 2024 ఎన్నికలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు జయమ్మ, రవిశంకర్, సభ్యులు రామాంజనేయులు, మన్యం సర్దార్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు. **శ్రీరామ్ నగర్‌లో :** 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం శ్రీ చైతన్య స్కూల్ దగ్గర సిపిఎం వార్డు కార్యదర్శి టి.సుంకన్న అధ్యక్షతన చేపట్టారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు మాట్లాడారు. నాయకులు సి.శేషాద్రి, ఎస్.శేషం రాజు ఎస్.అజ్మత్, జాన్సన్ రాజు, ఆసిఫ్, మల్లేష్ పాల్గొన్నారు. **గడియారం ఆసుపత్రి ఎదురుగా :** సిపిఎం సీనియర్ నాయకులు డి. పార్వతయ్య అధ్యక్షతన స్థానిక గడియారం హాస్పిటల్ ఎదురుగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి, ఎం రాజశేఖర్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు మొహమ్మద్ షరీఫ్‌లు మాట్లాడారు. నాయకులు శాలి భాషా, బాబు, నూర్ వలి, జావేద్, మున్నా, షేక్షావలి, మద్దిలేటి, ఇస్మాయిల్, షబ్బీర్ భాష, రాజు, అబ్దుల్లా, గౌస్ బాషా, మహబూబ్ బాషా పాల్గొన్నారు. **కర్నూలు హాస్పిటల్ :** నగరంలోని కృష్ణానగర్ ఐటిసి సెంటర్ దగ్గర సంతకాల సేకరణ కార్యక్రమం నగర కమిటీ సభ్యులు జి ఏసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం న్యూ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ సాయి బాబా మాట్లాడారు. నాయకులు ప్రభాకర్, లక్ష్మయ్య, రవి, దేవేంద్ర, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు అక్బర్ బాషా, ఆటో యూనియన్ నగరనాయకులు శ్రీనివాసులు, హమాలీ, ఆటో కార్మికులు పాల్గొన్నారు. అలాగే 32వ వార్డులో కరపత్రాలు పంపిణీ, వాల్ పోస్టర్స్ విడుదల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప, యం.దావీదు మాట్లాడారు. నాయకులు రామాంజనేయులు, సురేష్, శ్రీనివాసులు, ముక్తారు బి, రాజు, మద్దిలేటి, జె రాజు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **తుగ్గలి :** మండలంలోని జొన్నగిరి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు కొండారెడ్డి, సిఐటియు మండల అధ్యక్షులు రంగస్వామి, రైతు సంఘం నాయకులు రంగరాజు, హమాలీ సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు. **కోడుమూరు :** కోడుమూరులోని పార్టీ కార్యాలయంలో సమరభేరి వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గఫూర్‌మియా, సిఐటియు మండల కార్యదర్శి జిపి వీరన్న మాట్లాడారు. చేనేత జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, బుడ్డప్ప, వెంకటేష్, రాముడు, భవన నిర్మాణ కార్మికుడు సుంకన్న, రమేష్, విజయ్ పాల్గొన్నారు. **వెల్దుర్తి :** వెల్దుర్తిలోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం సమరభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నగేష్ మాట్లాడారు. సిపిఎం నాయకులు బద్రి, వెంకట రాముడు, సిఐటియు నాయకులు గిడ్డయ్య, మహేష్, అంజి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతన్న సంతకాల సేకరణ



సిపిఎం న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతన్న సంతకాల సేకరణ

హంద్రీనీవా సామర్థ్యాన్ని 70 టిఎంసిలకు పెంచాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - పత్తికొండ

రాయలసీమ సాగునీటి వనరులకు వరప్రధాయిని అయిన హంద్రీనీవా సామర్థ్యాన్ని 70 టిఎంసిలకు పెంచాలని, తద్వారా రాయలసీమ కరువుకు శాశ్వత విముక్తి కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జిల్లా డి.గౌస్ దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పత్తికొండ మండలంలోని పందికోన రిజర్వాయర్‌ను, హంద్రీనీవా ప్రధాన కాలవను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం హంద్రీనీవా సామర్థ్యం 40 టిఎంసిల నుండి 70 టిఎంసిలకు పెంచాలన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నీరు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి వెళ్తున్నాయని తెలిపారు. తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను తట్టుకోవాలంటే రాయలసీమ సాగునీటికి హంద్రీ నీవానే ప్రధాన ఆధారమని అన్నారు. క్రిష్ణగిరి, పందికోన, జీడిపల్లి, గొల్లపల్లిల దగ్గర రిజర్వాయర్లు నిర్మించి ఆయా జిల్లాల రైతాంగానికి సాగునీరు ఇవ్వాలన్నారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 70 టిఎంసిలకు పెంచడం ద్వారా ఈ ప్రాంతాన్ని కరువు నుండి శాశ్వతంగా విముక్తి కల్పించే అవకాశం ఉందని తెలిపారు. ఆ విధమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా మొదటి దశ పనులు కూడా నేటికీ పూర్తి కాలేదని, కర్నూలు జిల్లాలో అనేక చోట్ల పెండింగ్ పనులు ఉన్నాయని తెలిపారు. చెరువులకు నీళ్ల మళ్లింపు కార్యక్రమాన్ని సాగదీస్తున్నారని, పంట కాల్వల ద్వారా రైతులకు సాగునీరు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పంట కాలువల మాట ఎత్తట్లేదని అన్నారు. హంద్రీనీవా మొదటి దశ పూర్తి, హంద్రీనీవా సామర్థ్యం పెంపు, పంట కాలువలు నిర్మాణం, పెండింగ్ పనుల పూర్తికి సిపిఎం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బి.వీర శేఖర్, రంగారెడ్డి, నాయకులు దస్తగిరి, సురేంద్ర, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పందికోన రిజర్వాయర్ చెరువును పరిశీలిస్తున్న సిపిఎం బృందం

పుష్పాలంకరణతో రాఘవేంద్రుని బృందావనం

- మూల రాములు పూజలో పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం


పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో జరుగుతున్న సప్త రాత్రోత్సవాల్లో భాగంగా రాఘవేంద్రస్వామి మూల బృందావనం విశేష పుష్పాలంకరణతో భక్తులకు కనువిందు చేసింది. బుధవారం శ్రీమఠంలో రాఘవేంద్రుని నిజ బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి, బృందావనానికి పంచామృతాభిషేకం, అభిషేకం, తులసి అర్చన వంటి పూజలతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టువస్త్రాలతో, వివిధ పుష్ప హారాలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశేష పూజలు నిర్వహించారు. రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకున్నారు. ఆరాధన మహోత్సవాల సందర్భంగా శ్రీమఠం ముఖద్వారం పక్కన ఉన్న యోగీంద్ర సభామండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలును కొయ్య, రజత, గజ వాహనం, స్వర్ణ, నవరత్న, స్వర్ణ రథోత్సవాలపై ఉంచి పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా రథోత్సవాలను ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఊయల మండపం వరకు పల్లకిలో తెచ్చి ఊయల సేవ నిర్వహించారు.

దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయండి

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం

ప్రజాశక్తి - గోనెగండ్ల


సమావేశంలో మాట్లాడుతున్న దేవ సహాయం

దళితులపై జరుగుతున్న దాష్టీకాలకు, దళితుల సంక్షేమం పట్ల పాలకుల వ్యతిరేకంగా, అంటరాని తనంపై నిగ్గు తేల్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా దళిత రక్షణ కోసం యాత్రను నిర్వహించి, సెప్టెంబర్ 5వరకు ఆయా మండలంలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కెవిపిఎస్ నాయకులు తెలిపారు. బుధవారం గోనెగండ్ల ఎంపిడిఓ కార్యాలయ సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్‌బాబు మాట్లాడారు. గ్రామగ్రామాన దళితవాడలను తట్టి లేపే విధంగా జిల్లా సబ్ జాతాలను, సదస్సులను నిర్వహిస్తామన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం, సాంఘిక హక్కుల కోసం జరిగే ఈ సామాజిక ఉద్యమంలో దళితులతో పాటు అభ్యుదయవాదులు, ప్రజాతంత్ర వాదులు పాల్గొనాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, ఎవిజె.కృష్ణ, బి.కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు ఆంధ్ర గురు స్వామి, ఎం.భాస్కర్, మామిడికాయల రాజు, గిత్తరి రమేష్ పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతి ప్రజల గొంతుక ప్రజాశక్తి

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పేద, మధ్య తరగతి ప్రజల గొంతుక ప్రజాశక్తి దినపత్రిక అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం ప్రజాశక్తి దినపత్రిక 43వ వార్షికోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక అనుబంధాన్ని ఎమ్మిగనూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాశక్తి ప్రజల పక్షాన నిలిచి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే పత్రిక అని తెలిపారు. కమ్యూనిస్టు భావాలతో పేద, బడుగు, బలహీన వర్గాలు, మధ్య తరగతి, కార్మిక, కర్షక ఉద్యోగులు, సామాన్యుల తరఫున పోరాడే పత్రిక అన్నారు. కమ్యూనిస్టు భావాలు కలిగిన తాను టిడిపిలో కొనసాగుతున్నా ప్రజాశక్తిని అభిమానిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. ప్రజాశక్తి దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, నాయకులు నజీర్ అహ్మద్, ప్రజాశక్తి దినపత్రిక ఎమ్మిగనూరు విలేకరి దేవేంద్ర మూర్తి పాల్గొన్నారు.


ప్రజాశక్తి ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న తిక్కారెడ్డి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై సమరభేరి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి-ఆలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో స్థానిక నాయకులతో కలిసి సిపిఎం సమరభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెంచిన విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరారు. నిరుద్యోగాన్ని నిర్మూలించాలని చేపడుతున్న సమరభేరిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని తెలిపారు. రూ.450 ఉన్న సిలిండర్ ధర నేడు రూ.1200లకు పెరిగిందని, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, వాటి ప్రభావం నిత్యావసర వస్తువులపై పడిందని చెప్పారు. కూరగాయల ధరలు కూడా ఊహించనంతగా పెరిగాయని తెలిపారు. కందిపప్పు ధర రూ.80 నుంచి రూ.160కు పెరిగిందని చెప్పారు. వేలాది టన్నుల తిండి గింజలు, పప్పు దినుసులు అక్రమంగా దాచి కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా ధరలను నియంత్రించకుండా మోడీ భజనలో నిమగ్నమయ్యారని విమర్శించారు. అధికారంలోకి రాగానే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తానని, విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సందర్భంగా జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన ఇచ్చిన హామీని గాలికొదిలేసి ఈ నాలుగున్నర ఏళ్లలో ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని తెలిపారు. ఇప్పుడు ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, ఇలా రకరకాల చార్జీలతో ప్రజలపై మరిన్ని భారాలు వేశారని మండిపడ్డారు. ఈ ఒక్క సంవత్సరమే దాదాపు రూ.4 వేల కోట్ల భారం పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. సిపిఎం తాలూకా నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల నాయకులు ఈరన్న, తిమ్మప్ప, మైనా, అబ్దుల్లా, పరమేష్ గౌడ్ పాల్గొన్నారు. **హాలహర్విలోని** అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం మండల కార్యదర్శి ఎం.కృష్ణ ఆధ్వర్యంలో గోడపత్రికలు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ హాజరయ్యారు. **దేవనకొండలో** సిఐటియు కార్యాలయంలో సమరభేరి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల నాయకులు సూరి మాట్లాడారు. వై.రంగన్న, రాయుడు, కుమార్, రాముడు, మహేంద్ర, మహేష్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని మదిరె గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడారు. ఈనెల 30, 31 గ్రామాల్లో సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1, 2న గ్రామ సచివాలయాల ఎదుట ఆందోళన, 5న సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మండల నాయకులు చిన్న తిక్కన్న, శాఖ కార్యదర్శి శ్రీనివాసులు, పార్టీ సభ్యులు ఈరన్న, కుమారప్ప, జలంధర్, నడిపి మూకన్న, హనుమంతు పాల్గొన్నారు. **ఆదోనిలోని** సుందరయ్య భవన్‌లో సమరభేరి కరపత్రాలను విడుదల చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీనియర్ నాయకులు ఈరన్న, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ, సంతకాలు సేకరణ చేపట్టారు. పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, వెంకటేష్, నాగరాజు, నాగేంద్ర, నాయకులు రామానాయుడు, అంజి, శివ, రామాంజి, మోహన్, భీమా పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, జిల్లా నాయకులు గోవిందు, జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు గోడపత్రికలను ఆవిష్కరించారు. సిపిఎం పట్టణ నాయకులు లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా, రాముడు, కృష్ణ, లక్ష్మన్న, రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని చిగిలి, బినిగేరి, నగరూరు గ్రామాల్లో కరపత్రాలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, నాయకులు ఇబ్రహీం, ఈరన్న, ప్రకాష్, బద్రి, తిప్పన్న, షాషావలీ, అల్లాబకాష్ తెలిపారు.


ఆలూరులో గోడ పత్రికలను విడుదల చేస్తున్న నాయకులు


దేవనకొండలో గోడ పత్రికలను విడుదల చేస్తున్న నాయకులు


ఎమ్మిగనూరులో గోడ పత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కోసిగి

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించలేమంటూ చేతులెత్తేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ఇంటర్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఇస్మాయిల్, వీరేష్‌తో పాటు మరో 13 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మలారెడ్డి, ఎలప్ప, ఎల్లప్ప, మహేష్ పాల్గొన్నారు.

వాల్మీకులు ఐక్యతతో ఎదగాలి

- వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు రామిరెడ్డి తనయుల విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

వాల్మీకులు ఐకమత్యంతో రాజకీయంగా ఎదగాలని మంత్రాలయం మాజీ ఎంపిపి, కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ కీర్తిశేషులు ఎన్.రామిరెడ్డి కుమారులు, వైసిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వారి స్వగ్రామమైన మాధవరంలోని నివాసంలో మంత్రాలయంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు రూ.1.50 లక్షల నగదును వాల్మీకి నాయకులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గంలో వాల్మీకులందరూ ఐకమత్యంతో రాజకీయంగా ఎదగాలని కోరారు. వాల్మీకుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీఇచ్చారు. విరాళం ఇచ్చిన ముగ్గురు సోదరులకు శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఎంపిటిసి నక్కి వెంకటేష్, డిసి.తిమ్మప్ప, కాశీం, మిడిగలదిన్నె రామాంజి, మేకల నరసింహులు, వాల్మీకి నాయకులు ఉన్నారు.

24 గంటలూ వైద్య సేవలు

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీసుజయీంద్ర ఆరోగ్యశాలలో వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉండాలని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం శ్రీసుజయీంద్ర ఆరోగ్యశాలలో ఆస్పత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భక్తులు, ప్రజల సేవలకే ఆస్పత్రి ఉందని తెలిపారు. పీఠాధిపతులు శ్రీసుబుధేంద్ర తీర్థులు రూ.లక్షలు ఖర్చు చేసి వైద్య సదుపాయాలు కల్పించారని చెప్పారు. విధి నిర్వహణలో బాధ్యత ఉండాలని, డ్రెస్ కోడ్ పాటించాలని తెలిపారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎప్పుడూ ఆస్పత్రిలో సిబ్బంది ఉండాలని ఆదేశించారు. అంబులెన్స్ అందుబాటులో ఉండాలని, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్ సుధీంద్రరావు, కంఠశాస్త్రి, సంతాన గోపాల కృష్ణ, వసంత మాధవ్, కోఆర్డినేటర్ విజయీంద్ర రావు, ఫార్మాసిస్టు టి.ప్రదీప్, ల్యాబ్ టెక్నీషియన్ గురు వెంకటాచార్, ఎక్స్‌రే టెక్నీషియన్ గిరికిషోర్, రిసెప్షనిస్ట్ జయశ్రీ, అనసూయ, నర్సులు సరళ, ఈరమ్మ, రాధ పాల్గొన్నారు.

హోరాహోరీగా మార్కెట్ వేలం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి పంచాయతీ ఆవరణలో కూరగాయల మార్కెట్ వేలంపాటలు హోరాహోరీగా సాగాయి. బుధవారం పత్తికొండ ఇన్‌ఛార్జ్ డిఎల్‌పిఒ ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో మార్కెట్ వేలం పాట నిర్వహించారు. సర్పంచి మూలింటి రాధమ్మ అధ్యక్షతన వేలం పాట ప్రారంభించారు. ఆరుగురు పాటదారులు పాల్గొన్నారు. రసవత్తరంగా సాగిన వేలం పాటలో బోల్లురు ఆంజినేయులు రూ.56,01,000లకు పాట దక్కించుకున్నారు. పోయిన సారికంటే ఈసారి రూ.90 వేలు అధికంగా పంచాయతీకి ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఇందులో 25 శాతం అంటే రూ.14,00,250 గ్రామాభివృద్ధికి తీసేసినట్లు డిఎల్‌పిఒ ప్రకాష్ నాయుడు తెలిపారు. మిగిలిన రూ.42,00,750 పంచాయతీకి జమ చేయాలన్నారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, జడ్‌పిటిసి దొరబాబు, సొసైటీ జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర, సిఇఒ అశోక్, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామాంజినేయులు, వైస్ సర్పంచి వెంకటేశ్వరమ్మ, గ్రామ పెద్దలు తిమ్మన్న, సంజప్ప, నరసప్ప, రంగన్న, రామాంజినేయులు, లక్ష్మన్న పాల్గొన్నారు.


వేలం పాటలో పాల్గొన్న పత్తికొండ డిఎల్‌పిఒ ప్రకాష్ నాయుడు

ఇంటింటి సర్వే పూర్తి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

తప్పుల్లేని ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు నిర్వహించిన ఇంటింటి సర్వే పూర్తయిందని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2,51,573 ఓటర్లకు గాను 2,50,821 ఓటర్ల (99.70 శాతం) ఇంటింటి సర్వే పూర్తి చేశామని తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 కార్యక్రమాన్ని విజయవంతంగా, ఎలాంటి లోపాలకూ తావు లేకుండా చేపట్టినట్లు చెప్పారు. పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను జనవరి 5, 2024న ప్రచురించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. తహశీల్దార్ వెంకట లక్ష్మీ, ఎంపిడిఒ గీతావాణి, డిఎల్‌పిఒ శ్రీనివాసులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

రవి కృష్ణతోనే కప్పట్రాళ్ల గ్రామాభివృద్ధి

- ఎస్ఐ భూపాలుడు, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున

ప్రజాశక్తి- దేవనకొండ

కప్పట్రాళ్ల గ్రామాన్ని దత్తత తీసుకున్న గత ఎస్పీ ఆకె రవికృష్ణ కృషితోనే గ్రామం అభివృద్ధి చెందిందని ఎస్ఐ భూపాలుడు, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున తెలిపారు. బుధవారం కప్పట్రాళ్ల గ్రామంలోని కల్యాణ మండపంలో రవికృష్ణ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్ఐ భూపాలుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా 20 మంది కప్పట్రాళ్ల యువత రెడ్ క్రాస్ సొసైటీ వారికి రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. గ్రామంలో తానా స్త్రీశక్తి భవన్, జిల్లా పరిషత్ హై స్కూల్, కల్యాణ మండపం, వాటర్ ప్లాంట్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు తదితర వాటిని ఏర్పాటు చేసిన ఘనత రవి కృష్ణదేనని తెలిపారు. గ్రామంలో రోడ్లు, నీటి వసతిని ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేశారన్నారు. కప్పట్రాళ్ల ఫ్యాక్షన్ వీడి అభివృద్ధి బాటలో ముందుకు వెళ్తున్నందుకు సంతోషించాలని కోరారు. ఆయన ఆశలకనుగుణంగా గ్రామంలోని విద్యార్థులు, యువత బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గత ఎస్పీ ఆకె రవి కృష్ణ వర్చువల్‌గా కప్పట్రాళ్ల ప్రజలతో, మహిళలతో, విద్యార్థులతో మాట్లాడారు. త్వరలో గ్రామానికి వస్తున్నట్లు తెలిపారు. సే ట్రీస్ సంస్థ వారు రైతులకు ఇస్తున్న ఆగ్రో ఫారెస్ట్రీ మొక్కలను బాగా పెంచుకొని లాభాలు ఆర్జించాలని కోరారు. ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, ఎంపిటిసి రూపమ్మ, చింతమాను రవికుమార్, కౌలయ్య, చిన్న లాలప్ప, కె.రాజు, చింపిరన్న, గొర్ల సుంకన్న, మహాలింగడు పాల్గొన్నారు.


రవికృష్ణ పుట్టినరోజు వేడుకల్లో కప్పట్రాళ్ల గ్రామస్తులు


రాఖీ కడుతున్న చిన్నారులు

'నారాయణ'లో రక్షాబంధన్ వేడుకలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని నారాయణ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయుల సహకారంతో చిన్నారులు స్పెషల్ రాఖీని తయారు చేయించి, కట్టి వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులు ఒకరికొకరు రాఖీలు కడుతూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జాఫర్ మాట్లాడారు. రాఖీ పండగను తమ పాఠశాలలో జరుపుకున్నట్లు తెలిపారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

రైట్‌అప్: కార్యాలయం ముందు కూర్చున్న రైటర్లు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రజల ఆస్తులకు సంబంధించి యాజమాన్య హక్కు పత్రాలైన డాక్యుమెంట్ల రూపకల్పన విధానాన్ని ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికి నిరసనగా బుధవారం డాక్యుమెంట్ రైటర్లు ఆదోనిలో పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ లెటర్లు పవన్, విజయ్, ప్రతాప్ మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు పేరుతో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తెస్తోందని తెలిపారు. త్వరలోనే జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టనుందని పేర్కొన్నారు. సేల్‌డీడ్స్ వంటివి జరిగితే ఏవైనా లోపాలు చోటుచేసుకుంటే ఆస్తులు కలిగిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ ప్రక్రియను అమల్లోకి తెస్తే ఆన్‌లైన్ డాక్యుమెంట్ విధానంలో అమ్మకందారులను, కొనుగోలుదారులు మోసం చేసే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ప్రక్రియను అమల్లోకి తెచ్చి తమ పొట్ట కొట్టవద్దని కోరారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

- పట్టణంలో వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో వైసిపి హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్ శివన్న నగర్‌లో నూతనంగా వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త భవనాలను అందుబాటులోకి తీసుకురానుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న యుహెచ్‌సి భవనాలకు మెరుగులు దిద్దడంతో పాటు కొత్త సెంటర్ల ఏర్పాటు కోసం భవనాలను నిర్మిస్తోందని చెప్పారు. వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అశ్విని ఆయుర్వేదిక్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం

పట్టణంలోని మున్సిపల్ వాటర్ పంపు పక్కన (గంజిహళ్లి రోడ్డు) డాక్టర్ జి.విద్యారాణి నూతన అశ్విన్ ఆయుర్వేద స్పెషాలిటీ క్లినిక్‌ను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.


భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట

దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలి

- తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకునేందుకు దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, రైతుసంఘం మండల కార్యదర్శి కోటకొండ సూరి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ దాదాపు చివరి దశకు వచ్చిందని, వర్షాలు ఆశాజనకంగా లేకపోవడం, తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని మండలంలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. జూన్, జులైలో రైతులు వేసిన విత్తనాలు మొలవక తిరిగి విత్తనాలు వేశారని చెప్పారు. అవి కూడా మొలవక మళ్లీ ఆగస్టులో విత్తనాలు వేశారని, రెండు, మూడు సార్లు విత్తనాలు వేశారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితులతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మండలాన్ని కరువుగా ప్రకటించాలని కోరారు. ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో ఉన్న చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటిని మళ్లించాలని, చెరువుపై ఆధారపడిన భూముల్లో పంటలు రావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కరువుపై ప్రజాప్రతినిధులు స్పందించి కరువు మండలంగా ప్రకటింపజేసి రైతులను ఆదుకునేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రైతులు బజారి, ప్రహ్లాద, హమీద్, రంగన్న, ఎల్లప్ప, మల్లేష్, బాష పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

'గడపగడపకు'ను విజయవంతం చేద్దాం : వైసిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని ఏరూరు గ్రామంలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నామని ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి జూటూరు హేమలత మారయ్య, వైసిపి మండల కన్వీనర్ ఏరూరు రంగస్వామి వైసిపి శ్రేణులను కోరారు. బుధవారం చిప్పగిరిలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, వారి సోదరులు హాజరవుతారని తెలిపారు. మండలంలో ఉన్న ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

తిక్కారెడ్డి నిజం తెలుసుకొని మాట్లాడాలి

- ఎంపిపి ఈరన్న, వైసిపి మండల కన్వీనర్ బెట్టన గౌడ్

ప్రజాశక్తి - కోసిగి

టిడిపి మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి బూటకపు మాటలు మాట్లాడటం తగదని, నిజం తెలుసుకొని మాట్లాడాలని ఎంపిపి ఈరన్న, వైసిపి మండల కన్వీనర్ బెట్టనగౌడ్, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఎంపిపి ఈరన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టిడిపి ఆధ్వర్యంలో మంత్రాలయం నియోజవర్గంలోని కౌతాళం మండలం గుడికంబాల ఇసుకరీచ్ వద్దకు స్టువర్ట్‌పురం దొంగలను వెంటపెట్టుకొని వెళ్లి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఉన్న ఇసుక రీచులన్నీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నడిపిస్తున్నట్లు తిక్కారెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇసుక రీచుల్లో పాలసీ ప్రకారం ఇసుకను తవ్వుతున్నారని, ఎలాంటి అక్రమాలూ, అక్రమ రవాణా జరగడం లేదని తెలిపారు. చలానాలు కట్టి ఇసుకను తవ్విస్తున్నారని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీరు-చెట్టు పథకం మాదిరిగా అక్రమాలు జరగడం లేదని చెప్పారు. ప్రతిపక్షపార్టీలోనే వర్గపోరు ఉన్నందున ఆ పార్టీ టికెట్ ఈసారి ఆయనకు దక్కుతుందో లేదో అనే ఉద్దేశంతో ప్రభుత్వంపై, ఎమ్మెల్యేపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. నియోజవర్గంలో బాలనాగిరెడ్డి ఇప్పటివరకు మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయకేతనం ఎగురవేశారని, నాలుగోసారి కూడా విజయఢంకా మోగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు నాడిగేని నాగరాజు, మహంతి స్వామి, సీనియర్ నాయకులు మాణిక్య రాజు, కాంట్రాక్టర్ బసిరెడ్డి, సర్పంచి హారోన్, నరసింహ గౌడ్, బుళ్లి నరసింహులు, కాంట్రాక్టర్ నాగరాజు, చింతకుంట ఈరన్న పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ఈరన్న, నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఛైర్మన్ శాంత, వైసిపి ఇన్‌ఛార్జీ జయమనోజ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఆదోని పట్టణ వాసులకు తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించామని, ఎవరూ అధైర్య పడవద్దని మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 34వ వార్డులో రెండో రోజూ ఛైర్మన్ బోయ శాంత ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. జయమనోజ్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి వార్డుల సమస్యలు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదలకు 'అమ్మఒడి' అందిస్తూనే నాడు-నేడు కింద పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. వచ్చే 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, సాయిప్రసాద్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. వైసిపి ఆదోని పట్టణ అధ్యక్షులు బి.దేవా, రాష్ట్ర డైరెక్టర్ రేణుక, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ నియాజ్ అహ్మద్, కౌన్సిలర్లు రఘునాథ్ రెడ్డి, చలపతి, బాలాజీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, అసిస్టెంట్ ఇంజినీర్లు కృపాకర్, రాజశేఖర్ రెడ్డి, మెప్మా ఆఫీసర్ వీరారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, డీలర్ నాగరాజు, సన్నీ, మధుసూదన్ శర్మ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బాష, శ్రీలక్ష్మి, జులేఖాబీ, చిన్న ఈరన్న, రహీం, గంగాధర్, కోదండ, శంకర్, శోభలత, శీనా, వార్డు కౌన్సిలర్ అంజినమ్మ, వార్డు ఇన్‌ఛార్జీ కె.భాస్కర్, సూరి, రామలింగేశ్వర్ యాదవ్, మధు, ఏసు, పరిగెల నారాయణ ఉన్నారు.

వేతన సవరణను అమలు చేయాలి

- ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఎల్ఐసి సిబ్బంది వేతన సవరణను వెంటనే అమలు చేయాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం (ఐసిఈయు) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎల్ఐసి కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు రఘునాథ్ గౌడ్, ఎల్ఐసి క్లాస్-1 ఉద్యోగుల సంఘం నాయకులు మహేష్ కుమార్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ల సంఘం నాయకులు సుధాకర్ రావు, మొయినుద్దీన్ మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 12న 2 గంటల పాటు వాకౌట్ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30 శాతం ఫ్యామిలీ పింఛను, ఎన్‌పిఎస్ సిబ్బందికి 14 శాతం యాజమాన్యం కాంట్రిబ్యూషన్ ఇవ్వాలని కోరారు. వేతన సవరణ చర్చలు, అన్ని కేడర్లలో నూతన రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, సిబ్బంది సమస్యలపై యాజమాన్య ఏకపక్ష ధోరణి వీడాలని డిమాండ్ చేశారు. సిబ్బంది గోవర్ధన్, మురళీ, రాము, శంకర్, నజీర్ అహ్మద్, ఫైరోజ్, హంపయ్య, బ్రహ్మారెడ్డి, వీరారెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.